
# నన్ను ఉరి తియ్యండి జడ్జి



**- శైలకుమార్**

బోనులో నిలబడ్డవ్యక్తికేసి దృష్టి సారించాడు న్యాయాధిపతి. అతని కోరిక విచిత్రంగా వుంది. అతను పెట్టుకున్న అర్జీ మరీ ఇబ్బంది కలిగించేలా వుంది.

ఎముకలు పడిపోకుండా నరాలతో ముడేస్తే తయారైనట్లుంది అతని ఆకారం. అతని ముఖంలో కన్నా మెడికల్ కాలేజీ బీరువాలో వేలాడదీసిన అస్థి పంజరానికే ఎక్కువ జీవకళ వుంటుంది. ఏనుగు కో:సం తీసిన గోతిలో ఎలుక పడినట్లు అతని కళ్ళు.

"నన్ను త్వరగా ఉరి తీసెయ్యమని వీళ్ళను ఆదేశించండి మహాప్రభో" దీనంగా అన్నాడతను నూతిలోంచి మాట్లాడుతున్నట్లు.

"నీ పేరు" అడిగాడు జడ్జి తెలిసినా.

"సామాన్యుడు."

నిట్టూర్చి అతని కేసు ఫైలును, అతని అర్జీని అందుకున్నాడు జడ్జి.

అతను చేసిన నేరం బ్రతకలేక పోవడం. అందుకు ఏ కోర్టూ ఉరిశిక్ష వెయ్యదు. కాని అతడు బ్రతిమాలి, అర్థించి మరీ ఉరిశిక్ష వేయించుకున్నాడు. సంవత్సరం క్రితమే అమలు చేయాల్సి వుంది ఆ శిక్ష. కాని అనుకోకుండా అప్పటికి ఆరుసార్లు వాయిదా పడింది. దీనితో తనను త్వరగా ఉరి తియ్యమంటూ అర్జీ పెట్టుకున్నాడు ఆ సామాన్యుడు.

జైలర్‌ను, ఆ జిల్లా ఎస్.పి.ని బోనులోకి పిలిచాడు జడ్జి.

"న్యాయస్థానం విధించిన శిక్షను మీరెందుకు అమలు చేయలేదు. ఎందుకు మాటిమాటికి వాయిదా వేస్తున్నారు" నిలదీస్తున్నట్లు అడిగాడు జడ్జి జైలరును.

"అమలు జరపటానికి మేము అన్ని విధాలా ప్రయత్నిస్తున్నాము మిలార్డ్. కాని అనుకోని కారణాల వల్ల వాయిదా పడుతోంది" అతి వినయంగా సమాధానం ఇచ్చాడు జైలరు.

"ఏమిటా కారణాలు" ఆశ్చర్యంగా అడిగాడు జడ్జి.

"మొదటిసారి ఉరి తియ్యటానికి అన్నీ సిద్ధం చేశామండి. ఆ రాత్రి ఆఖరి కోరిక ఏమిటి అని అతన్ని అడిగినప్పుడు రెండు కూరల్తో కడుపునిండా భోజనం చేయటం అని అతను చెప్పాడండి. అతని కోరిక తీర్చామండి. దానితో ఉరి ఆగిపోయింది" నెమ్మదిగా వివరిస్తున్నట్లు చెప్పాడు జైలరు.

"అదెలా" అర్థం కాక అడిగాడు జడ్జి.

"అన్నంలో వున్న రాళ్ళు అతని కడుపులోకి చేరి ఆ రాత్రి అతనికి అపెండిసైటిస్ ఆపరేషన్ చేయవలసి వచ్చిందండి. ఆపరేషన్ చేసిన వ్యక్తిని ఉరి తియ్యలేం కదా"

"మరి రెండవసారి"

"దేశ వ్యాప్తంగా జరిగిన లారీల బంద్ సమ్మె వల్ల ఆగిందండి."

"దానికి దీనికీ ఏమిటయ్యా సంబంధం" కోపంగా అడిగాడు జడ్జి.

"ఉరి తియ్యటానికి కావలసిన తాడును సప్లయి చెయ్యమని ఓ వ్యాపారిని అడిగామండి. అతను మరో ఊరి నుండి ఆ తాడు తెప్పించవలసి వచ్చిందండి. ఆ తాడువున్న లారీ మార్గమధ్యంలో సమ్మె వల్ల ఆగిపోయిందండి. దానితో ఉరికూడా ఆగిందండి."

కోర్టులో వున్న అందరికీ నవ్వు వచ్చింది. కాని బలవంతంగా ఆపుకున్నారు. కొందరు తలలు వంచి ముసి ముసిగా నవ్వుకున్నారు.

"తర్వాత" తలపట్టుకోబోయి ఆగి అడిగాడు జడ్జి.

"ఆ తర్వాత అన్ని ఏర్పాట్లు చేసి అతన్ని ఉరి తీశామండి"

ఆశ్చర్యం, బాధ, కోపం నిడిపోయాయి జడ్జి ముఖంలో. ఉరితీసిన వ్యక్తి ఎలా బ్రతికి తన ఎదురుగా వున్నాడో ఆయనకు అర్థం కాలేదు. ప్రశ్నార్థకంగా చూశాడాయన జైలరువైపు.

"ఉరి తీశామండి. కాని బరువుకు తాడు తెగిపోవడం వల్ల అతను బ్రతికాడండి. ఎన్నిసార్లు ప్రయత్నించినా తాడు తెగిందే తప్ప అతను చావలేదండి" వినయంగా చెప్పాడు.

"ఎలాంటి తాడుతో ఉరి తీశారు."

"ప్రభుత్వం వారి నియమ నిబంధనలకు లోబడి వారి కొటేషన్ ప్రకారం కొన్న తాడుతోనండి"

అది అంత నాసిరకంగా వుందా అన్నట్లు ఇబ్బందిగా ముఖం పెట్టాడు జడ్జి.

"ఆ తరువాత మరోసారి" చెప్పబోయాడు జైలరు.

ఇక చెప్పనవసరం లేదు. అంతా అర్థమైంది అన్నట్లు చేయి వూపాడు జడ్జి. లోలోపల నవ్వుకుంటూ వినయంగా అవతలికి వెళ్ళిపోయాడు జైలు.

సామాన్యుడి కేసి ముఖం తిప్పాడు జడ్జి. ఆతృతగా చూస్తున్నాడు అతను జడ్జీ కేసి.

"అందరూ బ్రతకాలని కోరుకుంటారు. ఉరిశిక్ష వద్దు బాబూ అని మొత్తుకుంటారు. నువ్వేమిటయ్యా ఇలా" అడిగాడు జడ్జి.

"ఏం చెయ్యామంటారండి. ప్రపంచంలో ఎవరైనా ఒక్కసారే చస్తారు. కాని ఈ దేశంలో పౌరుడై పుట్టినందుకు నేను ఇదివరకే చాలాసార్లు చచ్చాను" దీనంగా చెప్పాడు సామాన్యుడు.

"అంటే"

"ఏముందండీ ఏలినవారి దయవల్ల మందుల కోసం ఓసారి చచ్చాను. కరెంటు కోత వల్ల మరోసారి చచ్చాను. గుంతలు నిండిన రోడ్ల వల్ల ఓసారి చచ్చాను. ఇలా ఇలా చాలాసార్లు చచ్చాను."

ఎన్నో కేసులు చూసి, వాదనలు విన్న జడ్జీకి కూడా ఏమీ అర్థం కాలేదు. సుత్తితో విరామం లేకుండా బల్లమీద కొట్టాలని, మిగిలివున్న కాస్త జుట్టు పీక్కోవాలని అనిపించింది ఆయనకు.

ఆయన స్థితి కొద్దిగా అర్థమైంది సామాన్యుడికి.

"అయ్యా! మన దేశంలో విషం తింటే చావరు, అన్నం తింటే చస్తారు. ఎందుకంటే రెండూ కల్తీయే కాబట్టి అన్నాడు ఓ మహాకవి. అలాగే సామాన్యుడు బ్రతకడం అంటే నిత్యం చావడం అయిపోతోంది" ఆగి అందరివైపు చూశాడు.

మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు.

"నా భార్య అనారోగ్యానికి ఏదో పెద్ద పేరు చెప్పాడు డాక్టరు. అలాగే మందుల లిస్టు కూడా పెద్దదే ఇచ్చాడు. తినీ తినక డబ్బు కూడబెట్టి మందులషాపుకు వెళ్ళిన ప్రతిసారి వాటి ధరలు పెరిగిపోయి వుండేవి. ఓ రాత్రి నా భార్య చచ్చిపోయింది. వున్న డబ్బు దాని అంతిమ సంస్కారాలు అయిపోయింది. అప్పుడు అర్ధాంగితో పాటు నేనూ మొదటిసారి చచ్చాను" అతని గొంతు గాద్గదమైంది.

"వయస్సులో వున్న నా కూతురు పెళ్ళి కాకుండానే గర్భవతి అయింది. ఏమిటమ్మా ఇది అని నిలదీస్తే కరెంటు కోత వల్ల అని వ్యంగ్యంగా చెప్పింది. తనూ, తనని ప్రేమించానని చెప్పినవాడు ఓ పార్కులో కబుర్లు చెప్పకుంటూ వుండగా కరెంటు పోయిందట, ఈడు వేడెక్కి అది నెల తప్పిందట. నిలదీస్తే ప్రేమించానని చెప్పినవాడు కడుపు తీయించేసుకోమని దాని ముఖాన ఓ వెయ్యి రూపాయలు పడేశాడట. ఎందులో నన్నా దూకి చావవే అన్నాను నేను. అందుకు నా కూతురు ఏమందో తెలుసా" ఆగి కోర్టులో వున్న అందరి వంక చూశాడు సామాన్యుడు. అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఎందుకు చావాలి నాన్నా ఓ రాత్రికి నా శరీరం వెల వెయ్యి రూపాయలన్న నిజం చెప్పాడు వాడు. రాత్రికి వెయ్యి అయితే నెలకు ఎంతో ఆలోచించు. ఆ డబ్బుతో సుఖంగా బ్రతకలేమా అంది. అప్పుడు మళ్ళీ నేను చచ్చాను.

మాది పడితే వినిపించేంత నిశ్శబ్దం. మధ్యగా వున్న పాతకాలం ఫ్యాను ఆ బాధ విని భరించలేనట్లు కిర్రు కిర్రు మంటోంది.

"నా కొడుకును పోలీసులు అరెస్టు చేయడంతో మరోసారి చచ్చిపోయాను బాబూ" ఏడ్చేస్తూ చెప్పాడు సామాన్యుడు.

"నీ కొడుకు ఉగ్రవాదా" వెంటనే అడిగాడు జడ్జి.

"వాడికి అసలు వాదించటమే రాదు బాబూ. ఇంటర్మీడియట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి వాడు కారణం అని నేరం మోపారు."

"మరి అది నేరం కాదా"

"అధికారం గాని డబ్బుగాని లేకుండా పుట్టడమే నేరమయ్యా. పదహారు లక్షలకు పరీక్ష పేపర్లు అమ్ముకున్న అధికారిని వదిలేసి పదహారేళ్ళ పసివాడిపై నేరం మోపారు."

"ఎలాగయ్యా"

"ఇచ్చిన నిధులు ఖర్చు పెట్టడం లేదని ముఖ్యమంత్రి మా వూరు వచ్చినప్పుడు మునిసిపల్ ఆఫీసర్ని తిట్టారయ్యా. దాంతో ఆ ఆఫీసర్ బావున్న రోడ్లన్నీ తవ్వించేసి తిరిగి కొత్త రోడ్లు వేయిస్తే నిధులు ఖర్చయిపోతాయని ఆ పథకం చేపట్టారండి."

"దానికీ నీ కొడుకు అరెస్టుకు ఏమిటి సంబంధం" విసుగ్గా అడిగాడు జడ్జి ఆఫీసరు తెలివితేటలు అర్థమై.

"అదే చెబుతున్నానండి. ఓ రోజు మా అబ్బాయి బజార్లో వెళ్తుంటే, ముందు వెళ్తే ఓ వ్యానులోంచి ఓ కాగితం ఎగిరిపడిందంట. దాన్ని అందుకుని చూశాక మావాడికి అర్థమైందట అది ఇంటర్మీడియట్ ప్రశ్నాపత్రం అని. ఆ లీకేజి ఎంక్వయిరీ చేసిన ఏలినవారి రక్షక భటులు అన్నిటికీ కారణం మావాడేనంటూ కేసు పెట్టేశారయ్యా, అప్పుడు చచ్చిపోయానండ. ఆ తర్వాత"

"సరే.. సరే.. ఇంతకూ ఇప్పుడు నీకేం కావాలంటావు" అడిగాడు జడ్జి విరుసగా అతను చెప్పబోయే విషయాలన్నీ వినే ఓపిక లేక.

"నన్ను వెంటనే ఉరి తీసెయ్యమని ఆదేశించండయ్యా" మరో మాట లేనట్లు చెప్పాడు సామాన్యుడు.

కొన్ని నిమిషాలు మౌనంగా వుండిపోయాడు జడ్జి ఆలోచిస్తూ. ఆ తరువాత నాలుగో రోజు ఉదయం అంటే మే నెల రెండవ తారీకు ఉదయం అతన్ని ఖచ్చితంగా ఉరి తీసెయ్యమని ఆజ్ఞాపించాడు.

మే 1

సాయంత్రం అవుతూ వుంది. జైలులోని ఛైరెక్స్ మూసేసే వేళ పోలీసులు డ్యూటీలు మారే వేళ—

ఆనందంగా తన సెల్‌లో అటూ ఇటూ తిరుగుతున్నాడు సామాన్యుడు. తెల్లవారితే తనను ఉరి తీసేస్తారు. అదీ అతని ఆనందానికి కారణం.

అంతలో జైలరు అతని సెల్ దగ్గరకు వచ్చాడు.

"నీకో చెడ్డ వార్తయ్యా" చెప్పాడు జైలరు.

"ఏమిటి సార్"

"రేపు నిన్ను ఉరి... తీయడం లేదు"

"ఎందుకు" గాభరాగా అడిగాడ.

"ఉరి తీయ్యడం అమానుషం అంటూ జీవకారుణ్య సంఘం వాళ్ళు సుప్రీంకోర్టులో రిట్ వేశారు. కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చింది."

ఇక తనను ఉరి తియ్యరేమో అన్నబాధతో గుండాగిపోయి నిజంగా చచ్చిపోయాడు సామాన్యుడు.

(చావటానికీ స్వాతంత్ర్యంలేని సామాన్యుడికి)

▲

## 90వ పెళ్ళిరోజు

అజర్‌బైజాన్‌లోని ఒక దంపతుల జంట 'గులామ్ అజయేవ్' అతని భార్య 'సదావ్' తమ 90వ పెళ్ళిరోజు పండుగ చేసుకున్నారు. 1917 నాటి రష్యన్ విప్లవం నాటికే వారు మధ్య వయస్కులు. వారి పిల్లలు, మనుమలు, మునిమనుమలు మొత్తం కలిసి 150 మందిదాకా ఉన్నారు.

– సేకరణ
హిమజారమణ


అద్భుత సిద్ధ ఉంగరం ఉచితం

FREE

మా ఈ మహిమాన్వితఉంగరాన్ని ధరించుటవల్ల లేదా దగ్గర ఉంచుకున్నా కూడా మీ సమస్త కోర్కెలు తీరగలవు. మీరు కోరుకున్న స్త్రీ లేదా పురుషులు మీ వశమవగలరు, పరీక్షలయందు ఉత్తీర్ణత, కోర్టు వ్యవహారము లందు జయము, వ్యాపారము నందు అధిక లాభములు, కోరుకున్న వివాహము, ఋణ విముక్తి, ఉద్యోగ ప్రాప్తి, అన్ని వ్యవహారము లందు జయము, శత్రువుల నాశనము మొదలగు నవేకాక అన్ని సమస్యలూ తీరిపోగలవు. మీ పేరు, రాశి, జన్మనక్షత్రము వ్రాస్తూ, మీకోరిక ఏమిటో తెలియజేస్తూ ఉచిత ఉంగరమున కొరకై మా ఆశ్రమమును సంప్రదించగలరు.

KAMRUP ASHRAM (I.A.)
LAL BIGHA (GAYA)